

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కొరకు సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777



విజయవాడ శుక్రవారం 21-08-2026 సంపుటి: 02 సంచిక : 49 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Friday, 21-08-2026 Volume :02 Issue: 49 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani


## కాంగ్రెస్ పార్టీ జాతి వ్యతిరేకి



- వందేమాతరం గీతాన్ని రెండు ముక్కలు చేసింది
- దేశ విభజనకు పునాది వేసింది
- రెండు జాతుల సిద్ధాంతానికి ఊపిరి పోసింది
- అమర వీరులను అవమానించింది
- ఆ పార్టీకి వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాలి
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు

02

## టర్కీ-ఇజ్రాయిల్ మధ్య యుద్ధ మేఘాలు

- సిరియా వేదికగా ఘర్షణలకు ఆస్కారం..
- సిరియాలో టర్కీ ఉనికిని ఒప్పుకోని ఇజ్రాయిల్..
- మధ్యధరా ప్రాంతంలో కూడా రెండు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం..

02



### మూడు రాష్ట్రాలను కలుపుతూ బుల్లెట్ ట్రైన్

# కారిడార్!

### అమరావతి, బెంగళూరు, చెన్నైలను కుప్పం మీదుగా అనుసంధానం


- గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- విభజన సమస్యలను త్వరగా తేల్చాలని కేంద్రానికి విజ్ఞప్తి
- దక్షిణ మండల మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక సూచనలు

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలను కలుపుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి ప్రతిపాదించారు. మూడు రాష్ట్రాల రాజధానులు, ప్రధాన నగరాలైన అమరావతి, బెంగళూరు, చెన్నైలను కలుపుతూ ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టును చేపట్టాలని ఆయన సూచించారు. ముఖ్యంగా, కుప్పం మీదుగా ఈ కారిడార్ వెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. గురువారం మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి

-మిగతా 2 లో



02

### కీవ్‌పై రష్యా

## భీకర దాడి

- 12 మంది మృతి
- 33 మందికి గాయాలు
- తొమ్మిది అంతస్తుల భవనానికి మంటలు
- దాడిని ఖండించిన జెలెన్‌స్కీ



02

### ఎన్డీయేలో బీజేపీ

## ఆధిపత్యం క్షీణించింది

- రాజకీయంగా మోదీ, అమిత్ షాల పని ఒడిసిపోయింది :
- స్వతంత్ర మెజారిటీ లేక బీజేపీ బలహీనపడింది
- 'ఇండియా' కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది
- ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని రాహుల్ పిలుపు



### 5 బిల్లులకు శాసనమండలి

## ఏకగ్రీవ ఆమోదం

- శాసనమండలిలో 5 కీలక బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి లోకేష్
- విద్య, గ్రంథాలయ, నైపుణ్య రంగాలకు సంబంధించిన బిల్లులు
- ఆమోదం పొందిన వాటిలో ప్రైవేటు స్కిల్ వర్సిటీల బిల్లు కూడా ఉంది

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 5 ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, మండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్య, గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి రంగాలలో సంస్కరణల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించింది. గురువారం జరిగిన శాసనమండలి సమావేశంలో మంత్రి లోకేష్ ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. మండలి ఆమోదించిన బిల్లులలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు-2026, ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు ఉన్నాయి. వీటితో పాటు ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన,

-మిగతా 2 లో



## ప్రాంతాలవారీగా 'స్థానిక' వ్యూహాలు

- 21 సీట్లలో పోటీ సార్వత్రిక ఎన్నికలకే పరిమితం
- క్షేత్రస్థాయి సమస్యలు నాకూ తెలుసు
- శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటాం
- పొత్తు అంశం నేను చూసుకుంటా.. ఎవరూ పార్టీ లైన్ దాటొద్దు
- పొత్తు ధర్మాన్ని పాటిస్తూ స్థానిక పోరుకు సిద్ధంకండి
- జనసైనికులు, వీరమహిళలను రాజకీయంగా బలోపేతం చేద్దాం
- పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలకు డిప్యూటీ సీఎం పవన్ దిశానిర్దేశం

**అమరావతి,**

'గత ప్రభుత్వ దాష్టీక పాలనను ముగించేందుకే జనసేన 21 స్థానాలకు పరిమితమై పోటీచేసింది. ఆ వ్యూహం ఆ సార్వత్రిక ఎన్నికలకే పరిమితం. స్థానిక ఎన్నికల కు ప్రాంతాలవారీగా... ఆ ప్రాంత రాజకీయ, సామాజిక పరిస్థితుల ఆధారంగా వ్యూహాలు ఉంటాయి. స్థానిక ఎన్నికల్లో జనసేన ప్రభావశీలంగా, మెరుగైన స్థాయిలో నిలబడుతుంది' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలోని జనసేన ఎల్పీ కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలతో కీలక సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలపై రెండున్నర గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి ఎమ్మెల్యే నుంచి వారివారి నియోజకవర్గాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలి, ఎంతమంది

-మిగతా 2 లో



## దక్షిణాదిని రాజకీయంగా శిక్షించొద్దు

- 1971 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ చేయాలి
- లోక్‌సభ స్థానాలను యథావిధిగా కొనసాగించాలి
- సదరన్ కౌన్సిల్ భేటీలో కర్ణాటక సీఎం డికె శివకుమార్
- మిగతా రాష్ట్రాలు మద్దతిస్తాయని ఆశాభావం
- దక్షిణాది రాష్ట్రాల సమస్యలపై చర్చ

02

డీలిమిటేషన్ పేరుతో జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించొద్దని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కేంద్రాన్ని కోరారు. 1971 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకుని లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను యథాతథంగా కొనసాగించాలని, జనాభా నియంత్రణలో విజయవంతమైన రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించే పరిస్థితి రాకూడదని దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో స్పష్టం చేశారు

### గ్రూప్-1పై విచారణకు

# మేము రెడీ

### డీఎస్సీపై సీబీఐ విచారణకు మీరు సిద్ధమా?

- లోకేష్‌ను కాపాడేందుకే గ్రూప్-1పై తప్పుడు ప్రచారమన్న జగన్
- గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల, ప్రిలిమ్స్ టీడీపీ హయాంలోనే జరిగాయని వెల్లడి
- హైకోర్టు ఆదేశాలతోనే మాన్యువల్ మూల్యాంకనం చేశామని స్పష్టీకరణ
- హాయ్ ల్యాండ్‌లో మూల్యాంకనం జరగలేదని, సిట్ దర్యాప్తుపై విమర్శలు

**అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాల నుంచి కుమారుడు నారా లోకేష్‌ను కాపాడుకునేందుకే, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జగన్ ధ్వజమెత్తారు. గ్రూప్-1 వ్యవహారంపై సీబీఐ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని, డీఎస్సీ కుంభకోణంపై సీబీఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. డీఎస్సీపై దర్యాప్తు చేయాలని ఇప్పటికే కేంద్రాన్ని

-మిగతా 2 లో






### పాఠశాలల దుస్థితిపై

## దీప్కే ఆగ్రహం

- విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే మెరుగైన వసతులని విమర్శ
- విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని డిమాండ్
- ఉజని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి పరిస్థితుల పరిశీలన
- కనీస మౌలిక వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బందులు
- పాఠశాలల నిర్లక్ష్యానికి ప్రజాప్రతినిధులే బాధ్యులని ఆరోపణ
- 'స్కూల్ లీక్ కరో' ప్రచారంతో అధికారుల్లో కదలిక
- తనిఖీల ఫలితంగా పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభం


**లాతూర్**

ప్రభుత్వ పాఠశాలలు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నాయని, విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే మెరుగైన వసతులు అందుతున్నాయని పేర్కొంటూ, మహారాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ఇటీవలే 'స్కూల్ లీక్ కరో' ప్రచారాన్ని ప్రారంభించిన దీప్కే తాజాగా లాతూర్‌లోని ఔసా తహసీల్, ఉజని గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు.అనంతరం

-మిగతా 2 లో

# కీవ్‌పై రష్యా భీకర దాడి

**- 12 మంది మృతి**
**- 33 మందికి గాయాలు**
**- తొమ్మిది అంతస్తుల భవనానికి మంటలు**
**- దాడిని ఖండించిన జెలెన్‌స్కీ**



కీవ్:
ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా జరిపిన భారీ మిస్సైల్, డ్రోన్ల దాడిలో 12 మంది మరణించారు. ప్రారంభంలో కనీసం ఆరుగురు మరణించినట్లు ఉక్రెయిన్ స్టేట్ ఎమర్జెన్సీ సర్వీస్ ప్రకటించింది. తర్వాత మరణాల సంఖ్య 12 కు చేరుకుంది. 33 మందికి పైగా గాయపడ్డారు. సోలోమియాన్స్కి జిల్లాలో తొమ్మిది అంతస్తుల నివాస భవనం పైభాగం ధ్వంసమై మంటలు చెలరేగాయి. రెస్క్యూ బృందాలు శిధిలాల నుంచి ఇద్దరిని బయటకు తీశాయి. అదే జిల్లాలోని పిల్లల ఆసుపత్రి దెబ్బతిని కిటికీలు పగిలాయి. చుట్టూ ఉన్న కార్లు తగలబడిపోయాయి. స్వియాటోషిన్స్కి, డార్నిట్స్కి జిల్లాల్లో కూడా నివాస భవనాలు, గిడ్డంగులు పాఠశాలలు ధ్వంసమైపోయాయి. రష్యా బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లను ఉపయోగించింది. ఉక్రెయిన్ వైమానిక దళం చాలా డ్రోన్లను కూల్చివేసినా బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోవడంలో ఇబ్బంది ఎదురైంది. బ్రోవారీ జిల్లాలో ఒకరు మరణించారు. మరొకరు గాయపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కీవ్ మేయర్ విటాలి క్లిట్చ్‌కో ప్రజలను ఆశ్రయాల్లో ఉండాలని హెచ్చరించారు. ఆగస్టు 21న సంతాప దినంగా ప్రకటించారు. పౌరులపై రష్యా దాడి చేస్తోందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. దాడిని ఖండించారు. గగనతల రక్షణ వ్యవస్థలకు తగినంత క్షిపణులు లేకపోవడమే కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. సైనిక లక్ష్యాలపైనే దాడి జరిగిందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ చెప్పింది. అయితే ఉక్రెయిన్ అధికారులు పౌర ప్రాంతాలు దెబ్బతిన్నాయని స్పష్టం చేశారు. ఒడెస్సా, చెర్నిహివ్ ప్రాంతాల్లో కూడా దాడులు జరిగి పలువురు గాయపడ్డారు. సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## టర్కీ-ఇజ్రాయిల్ మధ్య యుద్ధ మేఘాలు

**- సిరియా వేదికగా ఘర్షణలకు ఆస్కారం..**
**- సిరియాలో టర్కీ ఉనికిని ఒప్పుకోని ఇజ్రాయిల్..**
**- మధ్యధరా ప్రాంతంలో కూడా రెండు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం..**



న్యూఢిల్లీ
: మిడిల్ ఈస్ట్‌లో మరో యుద్ధానికి రంగం సిద్ధమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గాజా యుద్ధం తర్వాత సిరియా వేదికగా టర్కీ, ఇజ్రాయిల్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఈ రెండు దేశాలు అమెరికాకు మిత్రదేశాలుగా ఉన్నాయి. టర్కీ నాటోలో సభ్యదేశంగా ఉంది.
మరోవైపు ఇజ్రాయిల్‌కు ప్రతీ విషయంలో అమెరికా అండ ఉంటోంది. ఈ రెండు దేశాల మధ్య ఇప్పటికిప్పుడు యుద్ధం జరిగే అవకాశాలు లేకున్నా, పరిస్థితుల్ని బట్టి చిన్నపాటి సైనిక ఘర్షణను మాత్రం తోసిపుచ్చలేమని నిపుణులు చెబుతున్నారు. గాజా యుద్ధం టర్కీ, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలకు ప్రధాన కారణంగా ఉంది. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ఇజ్రాయెల్ సైనిక చర్యలను నిరంతరం విమర్శిస్తూ వస్తున్నారు. ఆయన పాలస్తీనాకు బహిరంగంగా మద్దతు తెలిపారు. గాజాలోని పౌరులను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు. టర్కీ వైఖరి పట్ల ఇజ్రాయిల్ కూడా సంతృప్తిగా లేదు.
పశ్చిమాసియాలో తమ ప్రయోజనాలకు టర్కీ ఒక సవాల్‌గా నిలుస్తోందని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నేతన్యాహూ భావిస్తున్నారు. సిరియాలో టర్కీ, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉంది. సిరియాలో పాలన మార్పు, బషర్ అల్ అసద్‌ను గద్దె దించడంలో టర్కీ అమెరికాకు సహకరించింది. టర్కీ కొత్తగా ఏర్పడిన సిరియా ప్రభుత్వంతో సన్నిహితంగా ఉంటోంది. అక్కడ టర్కీ తన సైనిక ఉనికిని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ పరిస్థితుల్ని ఇజ్రాయిల్ నిశితంగా గమనిస్తోంది. సిరియాలో పెరుగుతున్న టర్కీ సైనిక ఉనికి తమ భద్రతకు ముప్పుగా ఇజ్రాయిల్ భావిస్తోంది. మధ్యధరాలో కూడా టర్కీ వర్సెస్ ఇజ్రాయిల్ : టర్కీ, ఇజ్రాయిల్ మధ్య ఘర్షణ కేవలం గాజా, సిరియాలకు మాత్రమే పరిమితం కాలేదు. మధ్యధరా సముద్ర ప్రాంతంలో కూడా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉన్నాయి. ఈ సముద్రంలో గ్యాస్ నిల్వల విషయంలో రెండు దేశాల మధ్య ఘర్షణ ఉంది

## మూడు రాష్ట్రాలను కలుపుతూ బుల్లెట్ ట్రైన్ కారిడార్!

మొదటి తరువాయి

(సదరన్ జోనల్ కౌన్సిల్) సమావేశంలో చంద్రబాబు ఈ కీలక ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయవచ్చని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. అమరావతి, బెంగళూరు, చెన్నై నగరాలు ఇప్పటికే పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందాయని, ఈ నగరాల మధ్య హై-స్పీడ్ రైలు మార్గం ఏర్పాటు చేస్తే వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు మరింత ఊపందుకుంటాయని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## 5 బిల్లులకు శాసనమండలి ఏకగ్రీవ ఆమోదం

మొదటి తరువాయి



క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల (ఉపాధ్యాయుల కేడర్ లో రిజర్వేషన్) సవరణ బిల్లులను కూడా సభ ఆమోదించింది. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఏపీ ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి ఆమోదముద్ర వేసింది.
ఈ బిల్లులకు సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

# కాంగ్రెస్ పార్టీ జాతి వ్యతిరేకి

**- వందేమాతర గీతాన్ని రెండు ముక్కలు చేసింది**
**- దేశ విభజనకు పునాది వేసింది**
**- రెండు జాతుల సిద్ధాంతానికి ఊపిరి పోసింది**
**- అమర వీరులను అవమానించింది**
**- ఆ పార్టీకి వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాలి**
**- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు**



**మహాబలిపురం:**
వందేమాతరం గీతాన్ని అవమానించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ జాతి వ్యతిరేకిగా వ్యవహరిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. గురువారం తమిళనాడు, మహాబలిపురం, కోవలం వద్ద ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆగస్టు 20న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వందేమాతరంపై ఆశ్చర్యకరమైన, దేశవ్యతిరేక నిర్ణయం తీసుకుంది. తమ పార్టీ 1937 నాటి తీర్మానాన్ని అనుసరించి వందేమాతరంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలని నిర్ణయించుకున్నారు అని విమర్శించారు.
ముస్లిం బుజ్జగింపు రాజకీయాలు
యావత్ దేశానికి ఒక విషయం గుర్తు చేస్తున్నాను. 1937లో ముస్లింలను బుజ్జగించడానికి వందేమాతరాన్ని రెండు ముక్కలుగా చేసి, దేశ విభజనకు కాంగ్రెస్ పార్టీ పునాది వేసింది. అక్కడి నుంచి రెండు జాతుల సిద్ధాంతానికి బలం చేకూరింది. చివరకు దేశం విభజనకు గురై పాకిస్తాన్ పుట్టింది. నేడు వందేమాతరం ఆవిర్భావానికి 150వ సంవత్సరంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ చారిత్రక తప్పును సరిదిద్ది బంకిమ్ బాబు అమర కృతిని పూర్తిగా పాడించి జాతీయ సమైక్యతను బలోపేతం చేసే ప్రయత్నం చేసింది. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో దానిని పూర్తిగా పాడాలనే నిర్ణయానికి చట్టపరమైన రూపం కూడా ఇచ్చింది అని అమిత్ షా తెలిపారు.
అమర వీరులకు అవమానం
కాంగ్రెస్ పార్టీ నేతలు స్వర్గీయ బంకిమ్ బాబు అమర కృతిని అవమానించడమే కాకుండా వందేమాతర నినాదం చేస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం ఉరి కంబం ఎక్కిన లక్షలాది మంది అమరవీరులను కూడా అవమానించారు. అలాగే చాలా సంవత్సరాలు జైలులో గడిపిన వారిని కూడా అవమానించారు. నేడు కాంగ్రెస్ పార్టీ తన 1937 నాటి పార్టీ తీర్మానాన్ని అంగీకరించి పార్లమెంట్ చట్టాన్ని తిరస్కరిస్తోంది. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఈ దేశంలో బుజ్జగింపు రాజకీయాలను బలంగా ముందుకు తీసుకెళ్లాడాన్ని నేను విస్తుపోతున్నానని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.
కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాలి
ఈ దేశం ఒకసారి వందేమాతరాన్ని రెండు ముక్కలుగా చేయడానికి అనుమతించి తీవ్రమైన పరిణామాలను అనుభవించింది. ఇప్పుడు దేశ ప్రజలు ఒకమ్మై కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి. నిరసన గళం వినిపించాలి. ఇకపై బుజ్జగింపు రాజకీయాలు ఈ దేశంలో పనిచేయవు. ఇది స్వచ్ఛా దేశం. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచిన తర్వాత 1937లో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం సరిదిద్దిన దానికి ఏమాత్రం వ్యతిరేకతను ఈ దేశ ప్రజలు సహించరు. భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తోంది. ప్రజల్లో, చట్టసభల్లో దీనిని బలంగా వ్యతిరేకిస్తాము అని అమిత్ షా స్పష్టం చేశారు.

## ఎన్డీయేలో బీజేపీ ఆధిపత్యం క్షీణించింది

న్యూఢిల్లీ



ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర హోంమంత్రి అమిత్ షా లపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని, మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడంవల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపోయాయని రాహుల్‌గాంధీ అన్నారు. గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## దక్షిణాదిని రాజకీయంగా శిక్షించొద్దు

**-1971 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ చేయాలి**
**- లోక్‌సభ స్థానాలను యథావిధిగా కొనసాగించాలి**
**- సదరన్ కౌన్సిల్ భేటీలో కర్ణాటక సిఎం డికె శివకుమార్**
**- మిగతా రాష్ట్రాలు మద్దతిస్తాయని ఆశాభావం**
**- దక్షిణాది రాష్ట్రాల సమస్యలపై చర్చ**

చెన్నై:



దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఏపీ సిఎం చంద్రబాబు, తమిళనాడు సిఎం విజయ్, కర్ణాటక సిఎం డికే శివకుమార్, కేరళ సిఎం సతీశన్, తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తదితరులు హాజరయ్యారు. దక్షిణ ప్రాంతీయ మండలి 31వ సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి డికే శివకుమార్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశాన్ని ప్రస్తావించారు. తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ మధ్య కూడా కీలక చర్చ జరిగినట్లు సమాచారం. కావేరీ జలాల పంపిణీ, మేకేదాటు ప్రాజెక్టు అంశాల నేపథ్యంలో.. సమావేశంలో కర్ణాటక సీఎంతో పాటు పక్కనే కూర్చున్న తమిళనాడు సీఎం విజయ్‌తో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్ కేంద్రపాలిత ప్రాంతాలు దక్షిణ ప్రాంతీయ మండలిలో సభ్యులుగా ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు 1971 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా కొనసాగించాలని, వచ్చే 25 ఏళ్ల పాటు లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాల సంఖ్యను మార్చవద్దని కేంద్రాన్ని కోరుతూ దక్షిణ ప్రాంతీయ మండలి తీర్మానం చేయాలని శివకుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న ఈ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు దేశ పిలుపును విజయవంతంగా అమలు చేశాయని, అందుకు వాటిని రాజకీయంగా శిక్షించకూడదని ఆయన అన్నారు. జనాభాను సమర్థంగా నియంత్రించినందుకు దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గడానికి వీల్లేదని స్పష్టం చేశారు. "ఈ దక్షిణాది రాష్ట్రానికి లోక్‌సభ స్థానాలు తగ్గవని ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నాం. అయితే ప్రాతినిధ్యం కేవలం సంఖ్యకు సంబంధించిన విషయం కాదు. అది రాజకీయ బలం, మన గొంతుకు సంబంధించిన అంశం" అని శివకుమార్ అన్నారు. 1971 జనాభా ప్రాతిపదికను గౌరవిస్తూ లోక్‌సభ మొత్తం స్థానాల సంఖ్యను యథాతథంగా కొనసాగించాలని ఆయన కోరారు. "ఇక్కడున్న ముఖ్యమంత్రులందరూ నేను చెబుతున్నదానికి మద్దతు ఇస్తారని నమ్ముతున్నాను. 1971 ప్రాతిపదికను గౌరవిద్దాం. మన గొంతుక బలాన్ని కాపాడుకుందాం" అని ఆయన అన్నారు.
మేకేదాటు ప్రాజెక్టు కర్ణాటకకు మాత్రమే కాకుండా తమిళనాడుకు కూడా ముఖ్యమైనదని శివకుమార్ పేర్కొన్నారు. సమావేశానికి వెళ్తున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనతో మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు మధ్య కావేరీ జలాల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారని ఆయన తెలిపారు. "మేకేదాటు ప్రాజెక్టు నుంచి వచ్చే ప్రతి నీటి బొట్టు తమిళనాడు, పుదుచ్చేరి రైతులకు ఉపయోగపడుతుంది. మాకు సహకరించండి.. మేమూ మీకు సహాయం చేస్తాం" అని శివకుమార్ అన్నారు.

## పాఠశాలల దుస్థితిపై దీప్కే ఆగ్రహం

మొదటి తరువాయి

ఆయన విలేకరులతో మాట్లాడుతూ సరైన తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, సురక్షితమైన రాకపోకల వంటి కనీస మౌలిక వసతులు లేని అనేక పాఠశాలల దుస్థితికి ప్రజాప్రతినిధులు, మంత్రులే జవాబుదారీ వహించాలని అన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులను జంతువుల కంటే హీనంగా చూస్తున్నారని ఆయన ఆరోపించారు. కాగా సీజేపీ చేపట్టిన తనిఖీలు అధికారులను కదిలించాయని, పాఠశాలల్లో ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభమయ్యేలా చేశాయని దీప్కే తెలిపారు.

### గ్రూప్-1పై విచారణకు

# మేము రెడీ

మొదటి తరువాయి

కోరినట్లు ఆయన తెలిపారు.
ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గురించి వివరించారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వమే హడావిడిగా ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే మే 26న ప్రిలిమ్స్ పరీక్ష కూడా పూర్తియిందని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించి, 2020 డిసెంబర్‌లో మెయిన్స్ నిర్వహించామని తెలిపారు. టీడీపీ హయాంలోనే జరిగిన పరీక్షలో ఎంపికైన వారికి ఇప్పుడు రాజకీయ రంగు పులమడం దారుణమని అన్నారు.
కోవిడ్ కారణంగా మూల్యాంకనం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో ఏపీపీఎస్సీ కమిషన్ డిజిటల్ మూల్యాంకనానికి నిర్ణయం తీసుకుందని, అయితే దీనిపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారని జగన్ వివరించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్నందున, హైకోర్టు ఆదేశాల మేరకు డిజిటల్ మూల్యాంకనాన్ని పూర్తిగా పక్కనపెట్టి, మాన్యువల్ పద్ధతిలోనే జవాబు పత్రాలను దిద్దామని స్పష్టం చేశారు. ఆ మార్కుల ఆధారంగానే 163 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చామని, ఈ ప్రక్రియ మొత్తం హైకోర్టు పర్యవేక్షణలోనే జరిగిందని తెలిపారు. ఇప్పుడు సంబంధం లేని డిజిటల్ మూల్యాంకనంపై ఆరోపణలు చేయడం కేవలం ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవడమేనని విమర్శించారు.
గ్రూప్-1 మూల్యాంకనం హాయ్‌ల్యాండ్‌లో జరిగిందంటూ చేస్తున్న ప్రచారాన్ని జగన్ తీవ్రంగా ఖండించారు. అక్కడ ఎలాంటి మూల్యాంకనం జరగలేదని, ఈ విషయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నియమించిన సిట్ కూడా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొందని గుర్తుచేశారు. తమపై బురద జల్లేందుకు దర్యాప్తు బృందాలను వాడుకోవడం చంద్రబాబుకు అలవాటేనని ఆరోపించారు. నాలుగు ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారిపై విషం కక్కుతూ, వారి భవిష్యత్తును నాశనం చేయాలని చూడటం సరికాదని జగన్ హితవు పలికారు. ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా చివరకు నిజమే గెలుస్తుందని ఆయన అన్నారు.

# ప్రాంతాలవారీగా 'స్థానిక' వ్యూహాలు

మొదటి తరువాయి



అభ్యర్థులు సంసిద్ధంగా ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాలకే పరిమితం కాకుండా సమీప ప్రాంతాల్లో జనసేన బలాబలాలను బేరీజు వేసి, పోటీ చేసేందుకు తగిన స్థానాలను గుర్తించి పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సంసిద్ధులు కావాలని, పొత్తు ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల బరిలోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన ఎంత బలంగా నిలబడితే అంత మెరుగైన ఫలితం ఉంటుందన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పనకు ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేద్దామన్నారు. ఎమ్మెల్యేలతో పాటు సీనియర్ నాయకులు 9నుంచి 11మంది వరకూ కమిటీలో ఉంటారని తెలిపారు. 'మన పార్టీ ఎమ్మెల్యేలు లేని కొన్ని ప్రాంతాల్లో కూటమి ధర్మానికి భిన్నంగా వెళ్తుండడంపై శ్రేణుల్లో అసహనం ఉంది' అని పలువురు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు.
స్పందించిన అధినేత... 'ఆ అంశాలు నా దృష్టికీ వచ్చాయి. శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటాం. నియోజకవర్గాల్లో పార్టీ బలాబలాలపై దృష్టి సారించాలి. పొత్తు అంశం నేను చూసుకుంటా. ఎవరూ పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దు. జనసైనికులను, వీరమహిళలను రాజకీయంగా బలోపేతం చేసేవిధంగా ముందుకు వెళ్దాం' అని స్పష్టంచేశారు. సమావేశంలో మంత్రులు మనోహర్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ నాగబాబు, ఎంపీ లింగమనేని రమేశ్ పాల్గొన్నారు.
రేపు కేరళకు పవన్..
కేరళలోని ప్రకృతి వైద్య చికిత్సా కేంద్రానికి పవన్ కల్యాణ్ వెళ్లనున్నారు. రేపటి నుంచి 20రోజుల పాటు ఆయన అక్కడే ఉంటారు. తరచూ ఇబ్బంది పెడుతున్న ఆరోగ్యంపై దృష్టి సారించిన ఆయన ప్రకృతి వైద్యం చేయించుకోవాలని నిర్ణయించుకొని, కేరళ పయనమవుతున్నారు.

# ఐ పోలవరం మండలంలో హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై కళాజాత అవగాహన కార్యక్రమం




**ముమ్మిడివరం ఆగస్టు 20 ( నేటి దర్శిని )** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ఐ. పోలవరం మండలం కేశనకుర్రు మార్కెట్ ప్రాంతం మరియు గుత్తెనదీవి సెంటర్ నందు హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై కళాజాత అవగాహన కార్యక్రమాన్ని ప్రేమనందం బుర్రకథ బృందంచే నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూచనల మేరకు దిశా /జనకళ్యాణ్ ప్రివెన్షన్ యూనిట్ మరియు లింక్ వర్కర్స్ స్కీమ్ అలాగే చేంజెస్ సి ఎస్ ఓ క్షేత్రస్థాయి సిబ్బంది సహకారంతో ఇంటెన్సిఫైడ్ ఐ ఈ సి క్యాంపెన్ కార్యక్రమంలో భాగంగా హెచ్. ఐ. వి మరియు ఎయిడ్స్ పైన అవగాహనా కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి హెచ్. ఐ.వి ఎలా వస్తుంది, ఎలా రాదు, రాకుండా ఎలా జాగ్రత్త పడాలి, హెచ్ఐవి వచ్చిన పరిస్థితుల్లో చికిత్స ఎక్కడ లభ్యం అవుతుంది, సుఖవ్యాధుల పట్ల అవగాహన, వివక్షత, మరియు డ్రగ్స్ గురించి అలానే హెచ్. ఐ. వి చికిత్స గురించి తెలుపుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స, హెచ్ ఐ వి మరియు ఎయిడ్స్ పైన ఉచిత సేవలు అందుబాటులో ఉన్నాయని కళాజాత కార్యక్రమంలో వివరించారు. టోల్ ఫ్రీ నంబర్ -1097గురించి,హెచ్ఐవి మరియు ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ చట్టం -2017 గురించి , ఏ ఆర్ టి మందుల కేంద్రాలు, సుఖవ్యాధులు, టీబీ,యు ఆర్ కోడ్ గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సీబీస్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ జి. శ్రీను, ఔట్రీచ్ వర్కర్ ఏం . వి జ్యోతి, సి ఎస్ ఓ సిబ్బది దుర్గ , లింక్ వర్కర్ సిబ్బంది మరియు టి ప్రాజెక్ట్ పీఠం ఎడ్యుకేటర్ గుర్రాల అమల, లోకల్ పిహెచ్ సి సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ఔట్రేచ్ వర్కర్స్ ఎమ్. సుధా, ఎచ్ మంగళమ్మ, కె సుధా,లక్ష్మి,భారతమ్మ,ఇందిరమ్మ పీర్ ,ఎడ్యుకేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

# తాగు నీళ్లయినా ఇవ్వండి.. లేదా రాజీనామా అయినా చేయండి..!

**వైసిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై. రాజశేఖర్ రెడ్డి డిమాండ్**



**గుత్తి (గుంతకల్లు), ఆగస్టు 20 ( నేటి దర్శిని )** గుత్తి ప్రజలకు తాగునీళ్లయినా ఇవ్వండి.. లేదా మీ పదవులకు రాజీనామా అయినా చేయండి..! అంటూ టిడిపి ప్రజాప్రతినిధులను వైసీపీ అనుబంధం ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై. రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గుత్తి పట్టణంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ మేనేజర్ పులిచెర్ల రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గుత్తి ప్రజలకు తాగునీటి సమస్యను తీరుస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీని విస్మరించారని అన్నారు. ప్రస్తుతం గుత్తి ప్రజలు తాగునీటికి అనేక ఇక్కట్లు పడుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు సమానంగా, నిరంతరాయంగా తాగునీటి సరఫరా జరిగేలా చొరవ చూపాలని కోరారు. లేనిపక్షంలో వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి తాజా మాజీ కౌన్సిలర్ వరదరాజులు, ఆ పార్టీ పట్టణ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు అరుణ్ కుమార్, సుభాష్ చంద్రబోస్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సరిహద్దుల జాబితా విడుదల చేసిన ముమ్మిడివరం నగర పంచాయతీ



**ముమ్మిడివరం ఆగస్టు 20 ( నేటి దర్శిని )** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయితీయందు ప్రస్తుతం గల 20 వార్డులను 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన మరియు ది.01-01-2026 పబ్లిష్ చేసిన వార్డుల వారీ ఫోటో ఎలక్ట్రోరల్ సంఖ్య ప్రాతిపదికన అన్ని వార్డులలో సరాసరి ఓటింగ్ శాతం ఉండునట్లు వార్డు సరిహద్దులను నిర్ణయించి 23 వార్డులుగా పునర్విభజన చేయవలసినదిగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా వార్డు సరిహద్దుల జాబితాను ముమ్మిడివరం నగర పంచాయతీ అధికారులు విడుదల చేశారు. 1994 ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీలు/నగర పంచాయితీలు యాక్టులోని క్లాజ్ (1) రూల్ 4 ప్రకారం ముమ్మిడివరం నగర పంచాయితీని 23 వార్డులుగా పునర్విభజన చేయబడిన ముమ్మిడివరం నగర పంచాయితీని ప్రభుత్వం వారు జారీ చేసిన పరిమితులకు లోబడి వార్డు సరిహద్దులను విభజించుచూ జారీ చేసిన ఫైనల్ పబ్లికేషన్ కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ నెం.411 ను జిల్లా కలక్టరు, డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం, రెవెన్యూ డివిజనల్ అధికారి, అమలాపురం, మండల రెవెన్యూ అధికారి, ముమ్మిడివరం, మండల అభివృద్ధి అధికారి, ముమ్మిడివరం, సబ్ రిజిష్టర్ కార్యాలయము, ముమ్మిడివరం మరియు ముమ్మిడివరం నగర పంచాయితీ కార్యాలయ నోటీసు బోర్డుల యందు ప్రచురించడమైనదని పట్టణ ప్రజలకు తెలియజేస్తూ ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ బి రవివర్మ ప్రకటనను విడుదల చేశారు.

# కసాపురం దేవస్థానంలో తలనీలాల టెండర్ దక్కించుకున్న ప్రకాశం జిల్లా వాసి



**గుంతకల్లు, ఆగస్టు 20 ( నేటి దర్శిని )** గుంతకల్లు మండలం, కసాపురం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారికి సమర్పించే తలనీలాలు సేకరించుకునే లైసెన్స్ హక్కు కోసం హైకోర్టు ఉత్తర్వులు తేదీ: 06.08.2026/11.08.2026 in WP No.9993/2026&writ ppeal చీశీ.991/2026 తేదీ: 19.08.2026 ప్రకారం తేదీ: 01.04.2026(హైకోర్టు ఉత్తర్వుల మేరకు 01.04.2026 నుండి దేవస్థానం ద్వారా సేకరిస్తున్న తలనీలాలతో కలిపి) నుండి 31.03.2027 వరకు ఉన్న కాల పరిమితికి 20.08.2026 న గురువారం నాడు దేవస్థాన కార్యాలయంలో జరిగిన బహిరంగ వేలం - షీల్డ్ టెండర్ - ఈ - టెండర్ నిర్వహించగా బహిరంగ వేలంలో ఎవరు పాల్గొనలేదు. సీల్డ్ టెండర్ ముగ్గురు వేయగా, వీటన్నింటిలో ప్రకాశం జిల్లా చీమకుర్తి కి చెందిన కె. యాదగిరి రూ.1,71,00,099/- సీల్డ్ టెండర్ వేసి హెచ్చు పాట దారునిగా నిలిచి టెండర్ నిబంధనల ప్రకారం హెచ్చు పాటలో సగం రూ.85,50,099/- (జువీణ గా చెల్లించిన రూ.50 లక్షలు కాక) దేవస్థానానికి చెల్లించి తేదీ: 01.04.2006 నుండి దేవస్థానం సిబ్బంది సేకరించిన తెలనీరాలు స్వాధీనం చేసుకున్నారు. గత సంవత్సరం హెచ్చు పాట రూ.1,02,06,000/- కాగా, ఈ సంవత్సరం రూ2,71,00,999/-అవ్వగానే గత సంవత్సరం కంటే రూ.68,94,099/- అదనంగా దేవస్థానానికి ఈ లైసెన్స్ హక్కు పై ఆదాయం సమకూరింది. ఈ టెండర్ ప్రక్రియలో ఆలయ డిప్యూటీ కమిషనర్/కార్యనిర్వహణాధికారి మేడేపల్లి విజయరాజు, ఫౌండర్ ట్రస్టీ సుగుణమ్మ, ప్రధాన అర్చకులు కె. రాఘవాచార్యులు, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్లు వెంకటేష్, రామ్మోహన్, గుంతకల్లు గ్రూప్ దేవాలయ కార్య నిర్వహణ అధికారి మఠం మల్లికార్జున, గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, కసాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటస్వామి, కసాపురం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ నేతల చిత్రపటాలకు పాలాభిషేకం



**గుత్తి (గుంతకల్లు), ఆగస్టు 20 ( నేటి దర్శిని )** అనంతపురం నగరానికి చెందిన టిడిపి సామాన్య కార్యకర్త, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దళవాయి రమాదేవికి గవర్నర్ కోట కింద ఎమ్మెల్సీ పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం గుత్తిలో సూర్య వంశ వడియారాజుల సంఘం, ఓసీసీఐ ఆధ్వర్యంలో వడ్డెర నాయకులు రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ బాబుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గుత్తి ఆర్ అండ్ బి అతిథి గృహంలో వారంతా సమావేశం అయ్యి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓసి సీఐ రాష్ట్ర అధ్యక్షురాలు ఈ లక్ష్మీదేవి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, గుత్తి టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి బట్టల మారుతి ప్రసాద్,సూర్య వంశ వడియరాజుల సంఘం అధ్యక్షుడు పీట్ల చిరంజీవి, ఓసీసీఐ శాశ్వత సభ్యులు వరద రాజులు, సంఘం ఉపాధ్యక్షులు, తొండపాడు రామాంజి, చంద్ర, ధర్మపురం మాజీ సర్పంచ్ రిటైర్డ్ రామచంద్ర,సంఘం గౌరధ్యక్షులు, వెంకటరాముడు, కమిటీ మెంబర్లు, పోదొడ్డి సుధాకర్, వెంకటేష్ ఎంగిలిబండ వెంకటరాముడు, వీరాంజ, మునేష్, వీరాంజ, చెర్లోపల్లె రమేష్, నాగరాజు, రాజు, మామిదొడ్డి రమేష్, సురేష్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం రోడ్డెక్కిన అన్నదాతలు..

**-తహసీల్దార్ కార్యాలయం ముట్టడి.. రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో**



**ఉరవకొండ రూరల్, ఆగస్టు 20 ( నేటి దర్శిని** హంద్రీనీవా కాలువ నుంచి పిల్ల కాలువలకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రేణుమాకులపల్లి, నింబగల్లు, వ్యాసాపురం గ్రామాలకు చెందిన రైతులు గురువారం ఉరవకొండలో ఆందోళనకు దిగారు. తొలుత తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం అనంతపురం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మూడు గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో మిర్చి, కంది, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలను సాగు చేస్తున్నామని తెలిపారు. పంటల సాగు కోసం వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, ప్రస్తుతం సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా కాలువలోని పిల్ల కాలువలకు అధికారులు అడ్డంకులు ఏర్పాటు చేయడంతో సాగునీరు అందడం లేదని రైతులు ఆరోపించారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా పిల్ల కాలువలకు అడ్డుకట్టలు వేస్తున్నారని తెలిపారు. వెంటనే నీటిని విడుదల చేయకపోతే పంట పొలాలు పూర్తిగా ఎండిపోయి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హంద్రీనీవా అధికారులు స్పందించి పిల్ల కాలువలకు వెంటనే సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. రాస్తారోకోతో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి పరిస్థితిని సర్దుబాటు చేశారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామికి నూతన రథం నిర్మాణం



**ఉరవకొండ రూరల్, ఆగస్టు 20 ( నేటి దర్శిని )** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రేగటి నాగరాజు తెలిపారు. ఇందులో భాగంగా స్వామివారి రథోత్సవం కోసం నూతన రథం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ రేగటి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో దేవస్థాన అభివృద్ధి, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, చేపట్టాల్సిన నిర్మాణ పనులపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సాకే రమేష్‌బాబు మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నిర్వహించనున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవానికి అవసరమైన నూతన రథం నిర్మాణంపై చర్చించినట్లు తెలిపారు. అలాగే దేవస్థాన నిధులతో భక్తుల అవసరాలకు అనుగుణంగా వసతి గదులను దశలవారీగా నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. భక్తులు, దాతల సహకారంతో ప్రత్యేక వసతి గదుల నిర్మాణానికి అవకాశం కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు ఈవో తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి, భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ధర్మకర్తల మండలి ఎక్స్‌అఫీషియో సభ్యులు ఏ.ఎన్. ద్వారకానాథ చార్యులు, సభ్యులు బొల్లినేని పద్మాక్షి, కురుబ ఇందిరమ్మ, రామకృష్ణ, బోయ ఎర్రమ్మ, చంద్ర మౌళిస్వామి, ఎం.సి. నారాయణప్ప, ధనుంజయ ఆచారి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సంఘ ఆధారిత సంస్థల కీలక వ్యక్తులు నెట్వర్క్‌ను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలి



**ముమ్మిడివరం,ఆగస్టు 20 ( నేటి దర్శిని )** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం మండల కేంద్రమైన తాళ్ళరేవులో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో అనుకూల విధాన నిర్ణయాల కోసం లాబింగ్ అంశాలను గుర్తించడం మరియు నెట్వర్క్ ను బలోపేతం చేయడంపై సంఘ ఆధారిత సంస్థల కీలక వ్యక్తులతో మండల స్థాయి సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పోలీస్ శాఖ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ ఆధారిత సంస్థల కీలక వ్యక్తులు నెట్వర్క్ ను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని తద్వారా అపరిష్కృత సమస్యలకు చరమగీతం పాడవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ లాబీయింగ్ అంశాలను గుర్తించడం, వాటిని ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని సాధించుకునేలా ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాది ఝాన్సీ మాట్లాడుతూ పలు న్యాయ విషయాలను గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని స్త్రీ పురుషులు మరియు బీమాబాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.



గ్లామర్‌తో మతిపోగొడుతున్న ప్రీతి ముకుందన్..


# శర్వానంద్ 'భోగి' సినిమా విడుదల వాయిదా..

## అసలు కారణం ఇదే!




టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వాస్తవానికి ఆగస్టు 28న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా చిత్ర యూనిట్ నుంచి వెలువడిన సమాచారం ప్రకారం ఈ సినిమా అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు రావడం లేదు. వీఎఫ్ఎక్స్ పనులకు మరింత సమయం పడుతుండటంతో ఈ సినిమా విడుదలను వాయిదా వేసినట్లు తెలుస్తుంది. సినిమాలోని విజువల్ స్కేల్, పీరియడ్ వరల్డ్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లను ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమంగా తీర్చిదిద్దే ఉద్దేశంతోనే ఈ వాయిదా వేసినట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ పనులు పూర్తిగా పూర్తయిన తర్వాత కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. 1960ల నాటి ఉత్తర తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో ఈ బలమైన కథ సాగనుండగా, ఇందులో శర్వానంద్ 'గంగా' అనే అత్యంత ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఆయన సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా క్లైమాక్స్ కోసం చిత్రబృందం ఏకంగా 30 రోజుల పాటు సాగిన భారీ యాక్షన్ షెడ్యూల్‌ను ఇటీవల విజయవంతంగా పూర్తి చేసింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.


# ఆనంద్ దేవరకొండ 'ఎపిక్' నుంచి 'మనసా వాచా' మెలోడీ సాంగ్ విడుదల!



ఆనంద్ దేవరకొండ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' నుంచి తాజాగా ఒక అద్భుతమైన మెలోడీ సాంగ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'మనసా వాచా' అంటూ సాగే ఈ మ్యూజికల్ ట్రీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటూ దూసుకుపోతోంది. ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించిన మధురమైన బాణీలు ఈ పాటకు ప్రాణం పోశాయి. వినడానికి ఎంతో ప్రశాంతంగా, హృద్యంగా ఉన్న ఈ గీతాన్ని లెజెండరీ సింగర్ కె.ఎస్. చిత్ర మరియు చరణ్ శ్రీపతి ఎంతో అద్భుతంగా ఆలపించారు. వీరిద్దరి మాయాజాల గళం పాటలోని భావోద్వేగాన్ని మరింత ఎలివేట్ చేయగా, శ్రీహర్ష ఇమాని అందించిన అర్థవంతమైన సాహిత్యం పాటలోని మాధుర్యాన్ని రెట్టింపు చేసింది.ఈ చిత్రంలో ఆనంద్ దేవరకొండ సరసన వైష్ణవి కథానాయికగా నటిస్తుండగా, టాలెంటెడ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. యూత్ ఫుల్ లవ్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదలైన ఈ మెలోడీ సాంగ్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది.

# బాలీవుడ్‌కి భాగ్యశ్రీ భోర్సే!

## 'ఆషికీ 2' హీరోతో రొమాన్స్..



దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటి భాగ్యశ్రీ భోర్సే బాలీవుడ్‌లో జాక్‌పాట్ కొట్టారు. 'ఆషికీ 2' ఫేమ్ ఆదిత్య రాయ్ కపూర్ సరసన ఆమె కథానాయకిగా నటించేందుకు రంగం సిద్ధమైంది. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు మిలప్ జవేరి తెరకెక్కించనున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలు ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.ప్రముఖ నిర్మాణ సంస్థ టి-సిరీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. గత నెలలో అధికారికంగా ప్రకటించిన ఈ చిత్రం, పూర్తి స్థాయి ఇంటెన్స్, వయొలెంట్ అండ్ మ్యూజికల్ లవ్ స్టోరీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మిలప్ జవేరి తనదైన శైలిలో హై-పిచ్ రొమాంటిక్ డ్రామాగా ఈ సినిమాను మలచనున్నారు. ఇందులో ఆదిత్య రాయ్ కపూర్ ఎమోషనల్ అండ్ లేయర్డ్ ఉన్న వైవిధ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో కథానాయకిగా భాగ్యశ్రీ భోర్సేను ఖరారు చేశారని, త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమై 2027లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం భాగ్యశ్రీ సినీ కెరీర్‌లో ఈ ప్రాజెక్ట్ ఒక బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. గత కొద్దికాలంగా ఆమె సౌత్ ఇండస్ట్రీలో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో దూసుకెళ్తున్నారు. రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఆమె, రౌడీ హీరో విజయ్ దేవరకొండతో 'కింగ్ డమ్', అలాగే స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తో కలిసి 'కాంత', ఇటీవల అఖిల్‌తో కలిసి లెనిన్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్నారు. హిందీలో ఇంతకుముందు కొన్ని చిన్న పాత్రలు చేసినప్పటికీ, ఇప్పుడు ఏకంగా టి-సిరీస్ లాంటి దిగ్గజ బ్యానర్‌లో, ఓ స్టార్ హీరో సరసన లీడ్ రోల్ చేయడం ఆమె కెరీర్‌కు మైలురాయిగా నిలవనుంది. త్వరలోనే చిత్ర యూనిట్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# మమితా బైజు ..మరో మూవీతో సిద్ధం



ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.

# తల్లిదండ్రుల మధ్య సేదదీరిన విజయ్ దేవరకొండ

## ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫోటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ డ్రామా 'రణబాలి' చిత్రంలో ఈ రియల్ లైఫ్ కపుల్ ఆన్ స్క్రీన్‌పై జంటగా నటిస్తున్నారు.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450